
# తిరుగుబాటు

- పసుపులేటి తాతారావు



"అసమర్ధునికి ఆలి అయ్యేకన్నా బలవంతునికి బానిసయ్యేది మేలు" ఏ భార్యా తన భర్తతో అనకూడని మాట దారుణమైన మాట అనేసింది రవణమ్మ.

"అమ్మా, ఈ నాన్న మనకి పనికి రాడే. ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే." ఏ కొడుకూ తన తండ్రి గురించి అనకూడని తీవ్రమైన మాట అనేసాడు శ్రీను.

"మన ఖర్మరా. ఏం చేద్దాం? రొయ్య మీసాల బ్రతుకైపోయింది మనది. కాస్తయినా చీము, నెత్తురు ఉంటే కదా? పుణ్యంకొద్దీ పురుషుడు, పౌరుషం లేని బ్రతుకు" అంటూ చిరుబుర్రులాడుతూ సణిగింది రవణమ్మ.

"ఇంతకీ ఇప్పుడేమంటారు? పోయి వాడెవడితోనో గొడవేసుకోమంటారా?" అన్నాడు అసహనంగా గిరిధర్.

ఇలాంటి సూటిపోటు మాటలు ఎదుర్కోవాల్సి రావడం అతనికి ఈరోజు కొత్తేమీ కాదు. మొదట్నుంచీ అతనికిది మామూలే. కానీ అలాంటివి వినాల్సి వచ్చినప్పుడల్లా చాలా బాధనిపిస్తూంటుంది. తాను నిజంగానే అసమర్ధుడా? అన్న ఆలోచన అతన్ని అప్పుడప్పుడూ గుంజి వదిలిపెడుతూ ఉంటుంది. చేసేది గుమస్తా ఉద్యోగమే అయినా కూటికీ, గుడ్డకీ ఎప్పుడూ లోటు రానీయలేదు. చదువులకీ, ఫీజులకీ, పుస్తకాలకీ కూడా కొదవ చేయలేదు. సరదాలకీ, షికార్లకీ తాను తక్కువేం చేయలేదు. తన అవసరాలు మానుకొని అయినా కుటుంబ భారాన్ని ఈడ్చుతూ వస్తున్నాడు. మరి తాను అసమర్ధుడు ఎలా అవుతాడు?

నిజమే ఎదురైన ప్రతీ సమస్య పట్ల తాను రాజీ మార్గాన్నే అనుసరిస్తూ వస్తున్నాడు. కానీ అదంతా ఎవరికోసం? తన భార్యాబిడ్డల క్షేమంకోసం కాదూ? సమస్యల్ని ఎదిరించి నిలబడగల శక్తి లేని వాళ్ళు సమస్యల జోలికి పోకూడదు. రాజీపడి బ్రతకాల్సిందే. అంతకన్నా మార్గమేముంది?

"ఏమిటే వాగుతున్నావు? నాకన్నా బాగా చూసుకునే బలవంతుడు ఎవడు దొరుకుతాడే నీకు బానిస అవడానికి?" అని భార్య జుట్టు పట్టుకొని నాలుగు తగిలించేంత దుర్మార్గం అతని తత్వంలో లేదు. "ఏరా? ఇంటికి పెద్ద నేనా? నువ్వా? నేను నీకు పనికి రావాలా? నువ్వు నాకు పనికి రావాల్రా?" అంటూ కొడుకు వీపుని విమానం మోత మోగించేంత దౌర్జన్యం కూడా అతనికి లేదు.

ఉన్నదల్లా తనవాళ్ళు, తన కుటుంబం అన్న మమతానురాగం, ప్రేమాభిమానం. ఆ ప్రేమతోనే వాళ్ళకు ఏ బాధా కలగకూడదని కళ్ళల్లో పెట్టుకుంటూ చూసుకుంటున్నాడు. ఆ అభిమానంవల్లే తాను అవమానాన్ని సహించయినా ఊరుకుంటున్నాడు కానీ తిరిగి ఎదుటివాళ్ళని అవమానించాలని అనుకోవడం లేదు. అది బయటివాళ్ళే కానీ, ఇంట్లో వాళ్ళే కానీ, బహుశా అదే అతని అసమర్ధతేమో?!

గిరిధర్ స్వతహాగా నెమ్మదస్తుడు. మనిషి మెతక. ఇల్లు కట్టుకోక ముందు అద్దె ఇంట్లో ఉండేటప్పుడు ఇంటి ఓనర్లు పదే పదే తమమీద పెత్తనం చెలాయించేవాళ్ళు. ఇల్లు నీట్‌గా లేదనీ. కిటికీలకి చెదలు పడుతున్నాయనీ, గోడలు మసిబారుతున్నాయనీ, మేకులు దిగ్గొడుతున్నారనీ ఇలా రకరకాలుగా చీటికీ మాటికీ వేధించేవాళ్ళు.

రమణమ్మకి కోపం నషాళానికంటేది. "మనముంటున్నది ఊరికినే కాదు. నెలనెలా అద్దె చెల్లిస్తున్నాం. ఎందుకలా బెల్లంకొట్టిన రాయిలా నిలబడతారు? అవతలివాళ్ళు జులుం చూపిస్తే చేతులు ముడుచుకు కూర్చోవడమేనా? వాడన్ని మాటలు మాట్లాడుతుంటే నోరు మెదపరేం?" అంటూ విరుచుకుపడేది.

ఆమెని సముదాయించలేక గిరిధర్ తల ప్రాణం తోకకొచ్చేది. ఆమె నోటి దురుసుతనం విని ఓనర్ ఎక్కడ ఇల్లు ఖాళీచేయమంటాడోనని అతని భయం. అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయడమంటే మాటలు కాదు. ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. తీరా వేరే ఇంటికి వెళ్ళినా అక్కడా ఇలాంటి పరిస్థితే ఎదురుకాదని గ్యారంటీ లేదు కదా.

'అద్దె సకాలంలో చెల్లిస్తున్నాం కాబట్టి' ఇల్లు ఖాళీచేసేది లేదు. ఏం చేస్తారో చేసుకోండని చెప్పమంటుంది. కానీ అలా మొండికేసే తెగువ తనకి లేదు. గొడవపడి చెడిన సంబంధాలతో ఎంతకాలం సహవాసం చేయగలం? అలాంటి బ్రతుకు ప్రతీరోజూ నరకమే కదా? కోరి కోరి నరకాన్ని కొని తెచ్చుకున్నట్టే.

అందుకే కాస్త ఓర్పు వహించి ఊరుకుంటే అన్నీ వాటంతటవే సర్దుకుంటాయని భార్యకి నచ్చచెప్పడానికి ప్రయత్నించేవాడు. ఆమెకది గిట్టేది కాదు. ఆవేశమే కాని ఆలోచనెక్కడిదామెకి? అనాలోచితంగా ఎప్పుడుబడితే అప్పుడు ఇళ్ళు మారి డబ్బంతా తగలేసుకున్నాకా రేపొద్దున్న దేనికైనా డబ్బు చాల్లేదని అంటే మళ్ళీ అసమర్ధుడివంటూ దెప్పేది కూడా ఆమే! ఆ అసమర్ధతకి కారణం ఆమే అన్న నిజం ఆమెకెప్పటికీ తెలీదు.

సర్వీసులో చేరిన ఇన్నాళ్ళకయినా తానొక బుల్లి నూటేబై గజాల స్థలం కొనుక్కొని అందులో రెండగ్గిపెట్టలంత చిన్న ఇల్లు కట్టుకోగలిగాడంటే అందుకు కారణం తాను ఎలాంటి ఆవేశకావేశాలకీ పోకుండా ఆచితూచి అడుగేస్తూ జీవితాన్ని నెట్టుకు రావడమే అని అతని ప్రగాఢ విశ్వాసం.

స్థలం కొన్నప్పుడు కూడా చిన్న తమాషా అయిన ఘర్షణ ఎదురైంది. అతను కొన్న స్థలంలో కొనేటప్పటికి నాలుగైదు ఇనుప కమ్మెలు పడి ఉన్నాయి. స్థలం అమ్మిన అతను వదిలేసిన కమ్మీలు అవి. ఇల్లు కట్టుకుందామని వాటిని వేయించి ఏ కారణం చేతనో స్థలం అమ్మేయవలసి వచ్చి వాటిని అలాగే వదిలేసాడు. మరునాడు స్థలం దగ్గరికి వెళ్ళి చూస్తే అవి లేవు. ఆరాతీస్తే ఆ స్థలం పక్కనే ఉంటున్న ఇంటతను వాటిని తీసేసుకున్నట్టు తెలిసింది.

ఎందుకు తీసారని అడిగితే "మీకు స్థలం అమ్మినతను మా బంధువే. స్థలం అమ్మకం అయిపోయింది కాబట్టి వాటిని నన్ను తీసేసుకోమన్నాడు" అని చెప్పాడు.

గిరిధర్‌కి అతని సమాధానం సబబుగానే తోచింది. కానీ రవణమ్మకి మాత్రం రుచించలేదు. ఒకసారి స్థలం అమ్మకం జరిగిపోయాక స్థలంతోపాటూ అందులో ఏవైనా ఉంటే అవి కూడా మాకే చెందుతాయి. కాబట్టి అవి ఇచ్చి తీరాల్సిందే అని పట్టుపట్టింది. ఇరుపక్షాలకీ మధ్య వాగ్వివాదం లాంటిది చోటుచేసుకుంది.

గిరిధర్‌కి మాత్రం ఆ సమస్యని పెద్దది చేసుకోవడం ఇష్టంలేకపోయింది. స్థలం అమ్మినతను ఆ ఇనుప కమ్మెల గురించి తమకేమీ చెప్పలేదు. తాము కూడా స్థలం రేటు మాట్లాడుకున్నారే కానీ ఆ ఇనుప కమ్మెలు ఎవరికి చెందుతాయనే విషయాన్ని మాట్లాడుకోలేదు. ఎందుకంటే స్థలం అమ్మినతను వాటిని తీసుకుపోతాడేమో అనుకున్నారు. ఏ విధంగా చూసినా వాటిమీద తమకు హక్కు ఉన్నట్టు అనిపించలేదు గిరిధర్‌కి.

మనది కాని దానికోసం ఎందుకంత తాపత్రయం అని భార్యకి నచ్చచెప్పబోతే ఆమె కస్సున లేచింది. "మీకసలు రోషం లేదా? ఎదుటివాడు మన కళ్ళ ముందే మన సొమ్ముని దోచేస్తుంటే చేతకానివాడిలా ఎలా ఉండగలుగుతున్నారండీ? పదండి పోలీసుస్టేషన్‌లో కంప్లయింట్ ఇద్దాం. మీకు ధైర్యంలేకపోతే

చెప్పండి. పిల్లాడిని తీసుకొని నేనే వెళ్ళి ఇచ్చి వస్తాను" అన్నది పైటకొంగు చీరలో దోపుకుంటూ.

ఇల్లు కట్టుకున్నాకా కొన్ని దశాబ్దాలపాటూ కలిసి మెలిసి ఉండాల్సిన ఇరుగుపొరుగుతో ఇల్లు కట్టుకోక ముందే గొడవ! పోలీస్‌స్టేషన్‌లో కంప్లయింట్ ఇవ్వ లేదు. అది వేరే సంగతి. ఇనుప కమ్మెలు ఎలాగూ దక్క లేదు. కానీ గృహప్రవేశం చేసి ఎన్నేళ్ళు గడిచినా ఇప్ప టికీ ఆ యింటి వాళ్ళతో సఖ్యతగా ఉండడం వీలుపడ లేదు. భర్తకి పౌరుషంలేదన్న మాటనే పట్టుకు వేల్లాడ్డం తప్ప ఆ పౌరుషంవల్ల జరిగిన నష్టాన్ని కానీ, అందుకు కారణం తానే అన్న విషయాన్ని కానీ తెలుసుకొని భార్య మూర్ఖత్వానికి అతను జాలిపడుతూ ఉంటాడు. అప్పుడప్పుడూ లోలోపలే కోప్పడుతుంటాడు కూడా.

ఒకసారెప్పుడో గిరిధర్ ఎదురింటి కొండలరావు ఇంటికి ఏదో పనిమీద వెళ్ళి మాట్లాడి వచ్చాడు. అతనో పెద్ద రౌడీ అని పేరు. చూడ్డానికే భయంకరంగా ఉంటాడు. ఆ వీధిలో ఎవరైనాసరే అతనితో మాట్లాడా లంటేనే జడిసిపోతారు. గిరిధర్ అయినా మామూలుగా అయితే అతని ఇంటికి వెళ్ళి ఉండేవాడు కాదు. కానీ గ్రహస్థితి బాగా లేక వెళ్ళాల్సి వచ్చింది. అతను ఊళ్ళో లేనప్పుడు పోస్ట్‌లో ఏదో కవర్ వచ్చి అతని ఇంటి ముందు పడి ఉంటే వర్షం వచ్చేలా ఉందని గిరిధరే దాన్ని తీసి తన ఇంట్లో దాచాడు. అది ఇవ్వడానికే వెళ్ళి వచ్చాడు. అంతవరకూ బాగానే ఉంది. కానీ అలా వచ్చిన పావుగంటకి కొండలరావు వచ్చి ఓ చిత్రమైన ప్రతిపాదన చేసాడు. గిరిధర్ తమ ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ కొట్టి పిలవడంవల్ల షార్ట్ సర్క్యూట్ అయి వైరు కాలిపోయిందట. కాలింగ్ బెల్ మాడి పోయి పనిచేయడం మానేసిందట. గిరిధర్ స్విచ్ నొక్కి నప్పుడే అది కాలిపోయింది కాబట్టి అతనే దాని రిపేరు కయ్యే ఖర్చు భరించాలని కొండలరావు వాదన.

గిరిధర్‌కి దిమ్మతిరిగిపోయిందా వాదనకి. పుట్టి బుద్దెరి గాకా ఇలాంటి ప్రతిపాదన అతను ఎప్పుడూ ఎక్కడా విని ఉండలేదు. వాళ్ళ కాలింగ్ బెల్ చెడిపోవడమేమిటి? తాను బాగుచేయించడమేమిటి? తాను స్విచ్ నొక్కినప్పుడే అది షార్ట్‌సర్క్యూట్ కావడం నిజమే. కానీ కాలింగ్ బెల్ ఉన్న దెందుకు? నొక్కడానికి కాకపోతే?

"వర్షం నీళ్ళు ఇంట్లోకి కారి వైర్లు కాలిపోయి ఉంటాయి. దానికి నేనెలా బాధ్యుడిని?" అంటూ గిరి ధర్ వాదనకి దిగాడు. కానీ కొండలరావు దౌర్జన్యం ముందు నెగ్గలేకపోయాడు. గొడవ కాస్తా చివికి చివికి గాలివానైంది. చివరికి కొట్లాటకి దారితీస్తుందేమో అని భయపడ్డాడు. అందుకే అన్యాయానికి తలవంచి కాలింగ్ బెల్ రిపేరుకి అయిన ఖర్చు అతనే భరించాల్సి వచ్చింది.

ఎదుటివాడిది అన్యాయమని అతనికి తెలుసు. కానీ ప్రస్తుత సమాజంలో బలంముందు న్యాయం ఎక్కడ గెలుస్తుంది? ఎక్కడ దౌర్జన్యం జరిగితే అక్కడ హీరో ప్రత్యక్షమై రౌడీల్ని చితకబాది అమాయక ప్రజలకి న్యాయం చేకూర్చేది సినిమాల్లోనే. సమాజంలో కాదు. ఘోరం జరుగుతున్నా సరదాగా సినిమా చూస్తున్నట్లు ఆనందించే ఇరుగు పొరుగులున్న సమాజంలో అలాటి అద్భుతాలు జరగవు.

అందుకే రాజీ పడ్డాడు. అది పిరికితనమని అతనను కోలేదు. ముందుచూపుగా భావించాడు. తెలివైన నిర్ణ యంగా తనకుతాను సర్దిచెప్పుకున్నాడు. ఘర్షణ ముదిరితే తప్పు ఎవరిదైనా శిక్ష మాత్రం తనకే పడుతుంది. ఏ తలో పగిలి చస్తే కుటుంబం నిరాధారమయి పోతుంది. టెర్మినల్ బెనిఫిట్స్, ఇన్సూ రెన్స్ మహాఅయితే సంవత్సరమో రెండు సంవత్సరాలో సరిపోతాయి. తర్వాత దిక్కులేని వాళ్ళయిపోతారు. చావకుండా ఏ కాలో చెయ్యో విరిగి ఊరుకుంటే అది మరీ ఘోరం. ఏ టెర్మినల్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ రాకపోగా హాస్పిటల్ ఖర్చు ఎంత లేదన్నా నలభై, యాభయ్ వేలవు తుంది. ఎంతో జాగ్రత్తగా నెట్టుకొస్తున్న కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా అతలాకుతలమైపోతుంది. తమ లాంటి మధ్యతరగతివాళ్ళకి అది తేరుకోలేని దెబ్బ. అనుకోకుండా ఎదురయ్యే ఏక్సిడెంట్లని ఎలాగూ నివారించలేము. కనీసం మన చేతుల్లోనే ఉన్న వాటి నైనా నివారించుకోకపోతే అంతకన్నా తెలివి తక్కువ తనం మరొకటి ఉండదు. అందుకే రాజీపడాల్సి వచ్చింది.

**ఎదుటివాడిది అన్యాయమని అతనికి తెలుసు. కానీ ప్రస్తుత సమాజంలో బలం ముందు న్యాయం ఎక్కడ గెలుస్తుంది? ఎక్కడ దౌర్జన్యం జరిగితే అక్కడ హీరో ప్రత్యక్షమై రౌడీల్ని చితకబాది అమాయక ప్రజలకి న్యాయం చేకూర్చే ది సినిమాల్లోనే. సమాజంలో కాదు.**

అయితే ఇంటిలో వాళ్ళకి మాత్రం అది తన చేతకాని తనం. దౌర్జన్యాన్ని ఎదిరించలేని పిరికితనం. చెయ్యికి చెయ్యి. కాలుకి కాలు, పీకకి పీక! అలా బ్రతకాలంటుం దతని భార్య. కొడుకయితే వాడు ఇష్టంగా చూసే ఫైటింగ్ సినిమాల్లోలా వీరోచితంగా లేనందుకు తెగ నిరాశపడిపోతుంటాడు. సర్దార్ పాపారాయుడు సిని మాలో ఎన్.టి.యార్. పరాక్రమాన్ని ఒకసారి తనకి అన్యాపదేశంగా వర్ణించి చెప్పాడు. మనిషన్నవాడు అలా ఉండాలనీ అలాంటివాడి జోలికి రావడానికి ఎవ రైనా భయపడతారని కూడా చెప్పాడు. అదంతా వాడు ఎందుకు చెపుతున్నాడో తాను ఊహించకపోలేదు. కానీ తానేం చెప్పినా వాడికి రుచించదు కదా.

గిరిధర్ కొండలరావు దౌర్జన్యాన్ని తొందరగానే మరి చిపోగలిగాడు. కానీ ఆ సంఘటన వల్ల కుటుంబ సభ్యులు అంటించిన చురకలు మాత్రం అతన్ని చాలా కాలం బాధించాయి. ఎవరికోసమైతే తాను రాజీమా ర్గాన్ని అనుసరిస్తున్నాడో వాళ్ళే తనని అవహేళన చేయడం అతనికి మింగుడు పడలేదు.

అప్పుడప్పుడూ అతనిలోనూ అంతర్మథనం కలు గుతూ ఉంటుంది. మెత్తగా ఉన్నవాణ్ణి చూస్తే ఎవరికైనా మొత్తబుద్దేస్తుందంటారు. జబర్దస్తీ చేసేవాణ్ణి వాడంటే ఇష్టం లేని వాళ్ళు కూడా గౌరవిస్తూం టారు. బ్రతకాలంటే రాజీ పడడమొకటే కాదు. అప్పుడప్పుడూ మన బలం కూడా అవతలి వాళ్ళకి చూపించాలేమో.

సరిగ్గా అలా ఆలోచిస్తున్న సమయం లోనే జరిగిందా సంఘటన!

శ్రీను కాలేజి నుంచి సైకిల్ మీద వచ్చే స్తుంటే ఎవరిదో కారు సైకిల్‌ని గుద్దే సింది. శ్రీను క్రింద పడిపోయాడు. కారు ఆగకుండా వెళ్ళిపోయింది. అదృష్టం బాగుండి వాడికేం కాలేదు కానీ, సైకిల్ వెనక చక్రం మాత్రం వంగిపోయింది. వాడు ఏడుస్తూ సైకిల్‌ని లేపి పట్టుకొని ఒంటి చక్రం మీద నడిపించుకుంటూ ఇంటికొచ్చాడు.

తండ్రి ఇంటికి రాగానే భోరున ఏడుస్తూ వాపు జరిగి నదంతా చెప్పాడు. గిరిధర్ జరిగిన దానికి బాధపడి "పోనీలేరా. దేవుడు చల్లగా చూసాడు. నీకేం కాలేదు. అదే పదివేలు. సైకిల్ రేపే బాగుచేయిస్తాలే" అన్నాడు అనునయంగా.


"కారు నెంబర్ చూసాను. వాళ్ళ ఇల్లు కూడా నాకు తెలుసు" అన్నాడు వాడు.


గిరిధర్‌కి మతిపోయింది. ఏమిటి వీడి ఉద్దేశ్యం? అనుకున్నాడు మనసులో.

"పద నాన్నా వెళదాం. ఇల్లు నేను చూపిస్తానుగా?" అన్నాడు వాడు తండ్రి మౌనంగా ఉండడం చూసి.

"వెళ్ళి ఏం చేద్దాం?" అయోమయంగా అడిగాడు.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

"నన్ను ఢీకొట్టినందుకు వాడికి బుద్ధిచెప్పొద్దా?" అన్నాడు వాడు.

అందువల్ల వచ్చే లాభమేమిటో అర్థంకాలేదు గిరిధర్‌కి. తనను అవమానించిన వాడిని నాలుగు దులిపేయడం ద్వారా వాడి ఈగో సంతృప్తి పడితే పడవచ్చు. కానీ గొర్రె కొండని ఢీకొట్టడం ఎంత అవివేకమో అర్థంచేసుకునే వయసు వాడికి లేదు.

భార్య కూడా వాడినే వెనకేసుకు వచ్చింది. "కాస్తలో ఎంత పెద్ద ప్రమాదం తప్పింది వాడికి. అలా డేష్ ఇచ్చి దొరబాబులా వెళ్ళిపోయిన ఆ దగుల్బాజీని ఊరికే వదిలేస్తారా? అదే మరొకరెవరైనా అయితేనా..." అంటూ సాగదీసింది.

"మరయితే ఏం చేద్దామంటావు?" అని అడిగాడు.

"కాలర్ పట్టుకొని చెడామడా నాలుగు తిట్టి సైకిల్ రిపేరుచేయించి ఇమ్మనండి" అన్నది.

గిరిధర్ గతుక్కుమన్నాడు. "స్పాట్‌లో అయితే దారినిపోయే వాళ్ళ సపోర్ట్ ఉండేది. ఏక్సిడెంట్ జరిగితే అందరూ చిన్న వాహనం వాడినే సమర్థిస్తారు తప్పెవరిదైనా. కానీ వాడి ఇంటికే వెళ్ళి గొడవ పెట్టుకోవడమంటే..."

అతనలా నసిగినందుకే ఏ భార్యా తన భర్తని అనకూడని మాట అనేసింది రవణమ్మ. అతనలా వంకలు చెపుతున్నందుకే ఏ కొడుకూ అనకూడని మాట అనేసాడు శ్రీను.

"ఇంతకీ ఇప్పుడేమంటారు? పోయి వాడితో యుద్ధం చేయమంటారా?" అని గిరిధర్ చిరాకుగా అన్నది కూడా ఆ సందర్భంలోనే.

"అవును."

తల్లీ, కొడుకూ ఇద్దరూ ఒకేసారి అన్నారు. గిరిధర్ ఇబ్బందిగా మొహం పెట్టాడు. ఎలాగైనా భర్తలోని పిరికితనాన్ని పోగొట్టాలని రవణమ్మ తాపత్రయం. తండ్రి కారోణ్ణి బయటికి లాగి చెడామడా తిడుతుంటే చూసి ఆనందించవచ్చని శ్రీనుగాడి ఆశ.

గిరిధర్‌కి కోపమొచ్చింది. మంకుపట్టు పట్టిన తన కుటుంబ సభ్యుల మీద కాదు. అలాగని తన చేతకానితనం మీదా కాదు. కొడుకు సైకిల్‌ని ఢీకొట్టి ఈ న్యూసెన్స్ అంతటికీ కారణమైన ఆ కారు యజమాని మీద. నిజమే. కారుంది కదాని ఎవరినిబడితే వాళ్ళని గుద్దుకుంటూ పోవడానికి రోడ్డేమైనా వాడి బాబుగాడి సొమ్మా? నిజమే. ఊరుకున్నకొద్దీ ఊరంతటికీ లోకువైపోవడం ఖాయం. మనలోనూ పౌరుషం ఉందని అప్పుడప్పుడూ చూపాలి. నిజమే. సైకిల్‌ని తుక్కు తుక్కు చేసిన వాడు ఆ సైకిల్ రిపేరుకయ్యే ఖర్చు భరించాలి. కనీసం ఆగనైనా ఆగకుండా పోయిన కారు యజమాని మీద అంతులేని కోపం వచ్చింది గిరిధర్‌కి.

పేదవాని కోపం పెదవికి చేటన్న విషయం ఆ నిమిషంలో గుర్తురాలేదతనికి.

"పద" అన్నాడు ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా. ఈరోజు అటోఇటో తేలిపోవాలి. సైకిల్ రిపేరుకయ్యే డబ్బయినా రావాలి. లేకపోతే బలవంతులతో గొడవపెట్టుకుంటే ఎలాంటి నష్టాలు సంభవిస్తాయో అనుభవపూర్వకంగా తెలిసి తనవాళ్ళకి కనువిప్పయినా కావాలి. అనుక్షణం తానెందుకు అనుభవించాలీ నరకహింస అనుకుంటూ తిరుగుబాటు బావుటా ఎగరేసాడు.



గిరిధర్‌కి కోపమొచ్చింది. మంకుపట్టు పట్టిన తన కుటుంబ సభ్యుల మీద కాదు. అలాగని తన చేతకానితనం మీదా కాదు. కొడుకు సైకిల్‌ని ఢీకొట్టి ఈ న్యూసెన్స్ అంతటికీ కారణమైన ఆ కారు యజమాని మీద.

అన్నదే తడవుగా ఒక్క ఉరుకు బయటికురికాడు శ్రీను.

అశ్వారూఢుడై యుద్ధానికి తరలివెళుతున్న యోధుడిలా స్కూటర్ నడుపుతున్నాడు గిరిధర్. మహా సంగ్రామాన్ని కళ్ళారా వీక్షించే భాగ్యం కలగబోతున్నందుకు తెగ మురిసిపోతున్నాడు శ్రీను. దారిపొడవునా గిరిధర్ మనసులోనే రిహార్సల్స్ వేసుకున్నాడు. ఎలా మొదలెట్టాలి? ఏమేం అడగాలి. అవతలివాడు తిరిగి ఏం అడగొచ్చు? వాటికి మళ్ళీ ఏం సమాధానాలు చెప్పాలి? గొంతు ఏ స్థాయిలో పెంచాలి? అలా వరసగా అన్నీ మననం చేసుకుంటున్నాడు.

"నాన్నా అదిగో అదే ఇల్లు" అంటూ చూపించాడు శ్రీను.

స్కూటర్‌ని ఆ ఇంటి ముందు పార్క్‌చేసి శ్రీనుని బయటే ఉండమని చెప్పి గిరిధర్ లోపలికి వెళ్ళాడు. తన తండ్రి ఆ కారోడిని చొక్కా పుచ్చుకొని బయటికి లాక్కొచ్చే అందమైన సీన్‌కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు వాడు. తండ్రి తన శత్రువు మీద పెద్ద గొంతుతో విరుచుకుపడే వీరోచితమైన సందర్భం ఎప్పుడొస్తుందా అని కళ్ళల్లో వత్తులు వేసుకొని చూస్తూ నిలబడ్డాడు వాడు.

అయితేవాడు చూసిన దృశ్యాలేమీ ఎదురవలేదు వాడికి. లోపలినుంచి నిన్న తనకు ఢీ ఇచ్చిన కారు బయటికి వస్తూ కనిపించింది. 'అరె, కారోడు బయటికి వెళ్ళిపోతున్నాడు, నాన్నేమిటి లోపలికి వెళ్ళి ఇంకా రాలేదు?' అనుకున్నాడు వాడు.

"ఒరేయ్ శీనూ, కారెక్కు" అంటూ కారు లోపలి నుంచి వినిపించి ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంగా కారు వెనక సీటులో తండ్రి ఉన్నాడు. ఊహించని ఈ పరిణామమేమిటో అర్థంకాక అనాలోచితంగా కారు ఎక్కాడు వాడు. డ్రైవర్ కారు నడుపుతున్నాడు. తండ్రీ కొడుకులిద్దరూ కారు వెనక సీట్లో కూర్చున్నారు.

"నాన్నా నా సైకిల్‌ని ఢీకొట్టినందుకేనా ఈ కారుని తెచ్చేస్తున్నావు? భలే భలే" అన్నాడు శ్రీను.

"ష్... మాట్లాడకు" కసిరాడు గిరిధర్.

కాస్సేపటికి కారు మెకానిక్ షెడ్ దగ్గర ఆగింది. కారుకి పడిన సొట్టలు పూర్తిగా తీయించి, గన్ పెయింట్ వేయించేవరకూ గిరిధర్, శ్రీను అక్కడే ఉన్నారు. అందుకయిన డబ్బులు పూర్తిగా గిరిధరే చెల్లించాడు. శ్రీను తండ్రి కళ్ళలోకి అయోమయంగా చూసాడు. గిరిధర్ ఆ చూపుని జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేడు.

కారు మళ్ళీ అదే ఇంటి దగ్గర ఆగాక మళ్ళీ ఇంకోసారి లోపలికి వెళ్ళి వచ్చాడు. స్కూటర్ స్టార్ట్ చేసి కొడుకునెక్కించుకొని ఇంటిదారి పట్టాడు.

కొడుకు సైకిల్‌ని గుద్దేసిన వాడిని పల్లెత్తు మాట కూడా అనలేని తన అసమర్థతకి ఇంట్లో మళ్ళీ ఇంకోసారి ప్రశంసాపత్రాల్ని అందుకోవాల్సి వస్తుందని అతనికి తెలుసు. తమ సైకిల్ రిపేరు చేయించుకోలేకపోగా తప్పు తమదే అయినట్టు అవతలివాడి కారుని రిపేరు చేయించి ఇవ్వాల్సి రావడం అతను ఊహించనిది.

నోరులేని వాడితో దురదృష్టం కూడా ఆటలాడుకుంటుందేమో, లేకపోతే తనవాళ్ళ సంతోషంకోసం జీవితంలో మొట్టమొదటిసారిగా పౌరుషం తెచ్చుకొని అన్యాయానికి ఎదురు తిరగాలని తిరుగుబాటు బావుటా ఎగరేస్తే అక్కడ తన ప్రత్యర్థిగా ఉన్నది ఆఫీసులోని తన పై అధికారి అయి ఉండడమేమిటి? విడ్డూరం కాకపోతే! ★

రచయిత చిరునామా:
పి.తాతారావు,
అసిస్టెంట్ మేనేజర్,
ఆంధ్రా బ్యాంక్, జోనల్ ఆఫీస్,
ఆర్.ఆర్.పేట, ఏలూరు.

